జనగామ

మంగళవారం 11 మార్చి 2025
TUESDAY, MARCH 11, 2025

బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే కొండంత బలం

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : పార్టీకి కార్యకర్తలే కొండంత బలం అని సమావేశాల్లో పదేపదే చెప్పే బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ ఉచిత బీమా సౌకర్యం కల్పించడంతోపాటు ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున బీమా అందజేస్తున్నామని చెప్పారు. సోమవారం జనగామ నియోజకవర్గం బచ్చన్నపేట మండలం లెనిన్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త దాసరి ప్రభాకర్ ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మృతుడి భార్య దాసరి శిరీషకు రూ.2 లక్షల చెక్కును సోమవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ఏదైనా జరిగితే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నాకు పార్టీ అండగా నిలిచింది..

– దాసరి శిరీష, లెనిన్‌నగర్, బచ్చన్నపేట మండలం

బచ్చన్నపేట మండలం లెనిన్‌నగర్‌కు చెందిన నా భర్త దాసరి ప్రభాకర్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తాను తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగిన నా భర్తకు పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా రూ.2 లక్షలు వచ్చాయి. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నాకు, పిల్లలకు ధైర్యం చెప్పి చెక్కును అందజేశారు. ఆపదలో ఉన్న మాకు పార్టీ మేలు చేసింది. పార్టీ అధినేత కేసీఆర్‌కు మేము రుణపడి ఉంటాం.

చిన్నసైజు కోడిగుడ్లపై కొనసాగుతున్న విచారణ

జనగామ చౌరస్తా, మార్చి 10 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సోమవారం విచారణ చేపట్టారు. ఈ నెల 8వ తేదీన పలు అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు కోడిగుడ్లు సరఫరా అయిన విషయమై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా విచారణకు ఆదేశించారు. డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్ సూచనల మేరకు సూపర్‌వైజర్ రమాదేవి పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విచారణ చేపట్టి చిన్నసైజులో ఉన్న కోడిగుడ్లను పరిశీలించారు. వేయింగ్ మిషన్లపై వాటి బరువును కొలిచారు. 45 నుంచి 50 గ్రాముల బరువుండాల్సిన చిన్నసైజు కోడిగుడ్లు తక్కువ బరువుతో వస్తున్నాయని గుర్తించారు. సంబంధిత కాంట్రాక్టర్ ఇకపై చిన్నసైజులో ఉన్న కోడిగుడ్లను సరఫరా చేస్తే ఎట్టిపరిస్థితుల్లో తీసుకోవద్దని, వాటిని వాపస్ చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ఆదేశించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనిత, ఆయా లక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న రమాదేవి

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న తండావాసులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, మార్చి 10: మండలంలోని మల్లంపల్లి శివారు దాసుగూడెం తండాకు చెందిన కున్‌సోత్ స్వామినాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో తండావాసులు తమవంతుగా ముందుకొచ్చి ఆర్థికంగా సాయం అందజేశారు. ఆదివారం రాత్రి తండావాసులు స్వామి నాయక్ కుటుంబ సభ్యులకు రూ.41,141, రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అంద జేశారు. కుటుంబానికి అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తండావాసులు కున్‌సోత్ శ్రీరాం, అనిల్, ప్రమీల్, రాజుకుమార్, కుమార్, చందూలాల్, చిరంజీవ్, డాక్టర్ గౌడ్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

బుచ్చమ్మ(ఫైల్)

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

దేవరుప్పుల, మార్చి 10: ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. దేవరుప్పులకు చెందిన తోటకూరి బుచ్చమ్మ(74) అనారోగ్యంతో కొంత కాలంగా బాధపడుతోంది. ఆస్తమా, వినికిడి సమస్య ఉండడంతో జీవితంపై విరక్తి చెందిన బుచ్చమ్మ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు తోటకూరి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, మార్చి 10 : ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో 'ప్రజావాణి'లో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా 73 మంది అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చిల్పూరు మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు చెట్టబోయిన వెంకట కిష్టయ్య దంపతులకు చెందిన 8 ఎకరాల వ్యవసాయ భూమిని వారి కుమారులు తీసుకొని తల్లిదండ్రులను పోషించడంలేదని కలెక్టర్ రిజ్వాన్ బాషాకు మరోసారి ఫిర్యాదు చేశారు. గతంలో దీనిపై స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోకు కలెక్టర్ చెప్పినా వారి కుమారుల తీరు మారడం లేదని, దీనిపై ఆర్డీవోను పలుమార్లు కలిస్తే వృద్ధులను తిడుతున్నట్లు కలెక్టర్‌కు గోడు వెల్లబోసుకున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దేవరుప్పుల మండలానికి చెందిన ఎం సోమయ్యకు సంబంధించిన 4 ఎకరాల భూమి మరొకరి పేరిట ధరణిలో నమోదైందని, దానిపై విచారణ జరిపి తన పేరిట పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. జఫర్‌గడ్ మండలం చర్లతండాకు చెందిన లకావత్ భిక్షపతి బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.లక్షా 61 వేల రుణం తీసుకోగా, అతడి ఆధార్ కార్డును మరొకరి బ్యాంకు ఖాతాకు అనుసంధానించడంతో భిక్షపతి పేరిట బ్యాంక్‌లో రెండు లక్షల అప్పు తీసుకున్నట్లు చూపెడుతుండడంతో ప్రభుత్వం మాఫీ చేసిన రూ.2 లక్షల రుణమాఫీకి అనర్హుడైనట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. జనగామ పట్టణానికి చెందిన గంటా శ్రీలత తన పుట్టించి నుంచి పొందిన ఇల్లును తిరిగి ఇవ్వాలంటూ ఇబ్బందిపెడుతున్న సోదరుల నుంచి రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోలు గోపీరామ్, వెంకన్న, డీఆర్డీవో వసంత, కలెక్టరేట్ ఏవో మన్సూరీ, సీపీవో శ్రీనివాస్, డీపీవో స్వరూప, డీసీఎస్‌వో సరస్వతి, డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్, డీఏవో రామారావు నాయక్, డీపీవో స్వరూప, సీపీవో పాపారావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్

'ప్రజావాణి'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్‌ఎస్ నాయకులు

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జనగామ చౌరస్తా, మార్చి 10 : పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నేతల రాజకీయ సమావేశాలపై వెంటనే విచారణ చేపట్టాలని సోమవారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అసెంబ్లీ కార్యదర్శితో చర్చించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం జడ్పీలో బీఆర్‌ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాస్‌రావు, జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రాంరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దగ్గరుండి తెలుసుకోవడానికి, అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలకు అధికారిక క్యాంప్ కార్యాలయాలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే యశస్వినీరెడ్డితో పాటు వారి అత్తగారు ఎన్ఆర్ఐ అయిన ఝాన్సీరెడ్డి ఇటీవల క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆ పార్టీలో చేరే కార్యక్రమాలు, రాజకీయాలకు సంబంధించిన మీడియా సమావేశాలు నిర్వహిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇది భారతదేశ ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 123 (7) ప్రకారం అధికార దుర్వినియోగం అని తెలిపారు. ఎమ్మెల్యే అధికారిక కార్యాలయంలో రాజకీయ కార్యకలాపాలపై విచారణ జరిపి, సంబంధిత ఎమ్మెల్యే యశస్వినీరెడ్డితో పాటు దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల అధ్యక్షులు పసునూరి నవీన్, తీగల దయాకర్, సిందె రామోజీ, నాయకులు పల్లా సుందరరామిరెడ్డి, అల్లం ప్రదీప్‌రెడ్డి, పేరం రాము, కొల్లూరి సోమయ్య, మాచర్ల ఎల్లయ్య, చింత రవి, ధరావత్ రాంసింగ్ నాయక్, బస్వ మల్లేశం, గర్వందుల మల్లేశ్, కరుణాకర్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న వరంగల్ సీపీ సన్ ప్రీత్‌సింగ్

సీఎం పర్యటన ఏర్పాట్లపై
వరంగల్ సీపీ పరిశీలన

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 10 : ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ సోమవారం పర్యటించారు. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి సభా స్థలాన్ని పరిశీలించారు. శివునిపల్లిలో ఈ నెల 16 సీఎం బహిరంగ సభ నిర్వహించనుండగా సభాస్థలిని, పబ్లిక్ మీటింగ్‌కు సంబంధించి పార్కింగ్, హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు. పోలీస్ బందోబస్త్‌పై స్టేషన్ ఘన్‌పూర్ డివిజనల్ పోలీస్ అధికారులతో సీపీ సమీక్ష జరిపారు. ఏసీపీలు భీంశర్మ, అంబటి నర్సయ్య, సీఐలు వేణు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు వినయ్ కుమార్, సిరిపురం నవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం : కలెక్టర్

శానిటేషన్ సిబ్బందిని సన్మానిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, మార్చి 10 : సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ రిజ్వాన్ బాషా, విశిష్ట అతిథులుగా అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 80 శాతం వరకు మహిళలే జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తిని ఇక ముం దు కూడా కొనసాగించాలని పేర్కొన్నారు. మహిళలు సమానత్వంతో పాటు ఐక్యతను కలిగి ఉండాలని సూచించారు. వ్యాపార, వృత్తి, ఉపాధి రంగాల్లో మహిళలు గణనీయమైన అభివృద్ధిని సాధిస్తున్నారని కొనియాడారు. మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారంతో పాటు వారి వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. ప్రతి ఆడకూతురును వారి తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టరేట్‌ను శుభ్రపరుస్తున్న మహిళా శానిటేషన్ సిబ్బందితో పాటు మున్సిపల్ పారిశుధ్య కార్మికులను కలెక్టర్ రిజ్వాన్ బాషా సన్మానించి బహుమతులు అందజేశారు. వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మాధురీ కిరణ్ చంద్రషా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్, డీపీవో స్వరూప, డీఆర్డీవో వసంత, డిప్యూటీ సీఈవో సరిత, డీఎంహెచ్‌వో మల్లికార్జున్‌రావు, టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా షరీఫ్, పెండెల శ్రీనివాస్, సీడీపీవో రమాదేవి, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ హెచ్ శారద పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల ఆదేశం

జనగామ చౌరస్తా, మార్చి 10 : జిల్లాలో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారితో కలిసి సాగు నీటి నిర్వహణ, విద్యుత్ సరఫరాపై జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నీటి పారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పంటలకు సాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దేవాదుల ప్రాజెక్ట్ కింద అత్యధికంగా వరి పంట ఉందని, ఎగువ భాగాన రైతులు ఎక్కువ మోటార్లు పెడుతున్నారని తెలిపారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని, నీటి కొరత లేకుండా చూడాలని కోరారు. ఎక్కడ కూడా పంటలు ఎండిపోకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ప్రస్తుతం గండి రామారం, బొమ్మకూరుకు పంపుల ద్వారా సాగు నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి అశ్వరావుపల్లి రిజర్వాయర్ వరకు, అలాగే గండి రామారం నుంచి బొమ్మకూరు రిజర్వాయర్ వరకు సాగు నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వీడియో అనంతరం ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో సాగు నీటి విడుదలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడంతో పాటు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్
సెకండియర్ పరీక్షలు

జనగామ చౌరస్తా, మార్చి 10 : ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ థియరీ వార్షిక పరీక్షలు నాలుగో రోజు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. సోమవారం జిల్లాలోని 17 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఇంగ్లిష్ పేపర్–2 పరీక్షకు జనరల్, ఒకేషనల్ విభాగం విద్యార్థులు మొత్తం 4132 మంది హాజరుకావాల్సి ఉండగా, 4044 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్, డీఐఈవో జితేందర్‌రెడ్డి తెలిపారు. మరో 88 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 98 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొ న్నారు. పరీక్షా కేంద్రాలను స్క్వాడ్ తనిఖీ చేస్తున్నదని తెలిపారు.

ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలి

- **ఈ నెల 16లోగా చెల్లించకుంటే సీఎం పర్యటనను అడ్డుకుంటాం**
- **సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**

గానుగుపహాడ్‌లో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న జాన్‌వెస్లీ, నాయకులు

జనగామ చౌరస్తా/బచ్చన్నపేట/ రఘునాథపల్లి/ జనగామ రూరల్/ స్టేషన్ ఘన్‌పూర్/ దేవరుప్పుల/పాలకుర్తి, మార్చి 10 : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈ నెల 16న స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉందని, ఈ లోగా పరిహారం చెల్లించకుంటే సీఎం పర్యటనను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. సోమవారం బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్ల, జనగామ మండలం గానుగుపహాడ్, వడ్లకొండ, దేవరుప్పుల, రఘునాథపల్లి, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాల్లో పర్యటించారు.. సాగునీరందక ఎండిన పంటలను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో జాన్‌వెస్లీ విలేకరులతో మాట్లాడారు. సాగునీరు లేక అడుగంటిన భూగర్భ జలాలతో ఇప్పటికే 40 శాతం పంటలు ఎండిపోయాయని అన్నారు. ఈ నెల 16న సీఎం పర్యటన ఉన్నందున ఈలోపు చెరువులు, కుంటలు నింపి రైతన్నలను ఆదుకోవాలన్నారు. జనగామ జిల్లాలో ఎండిన పంటలను చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదన్నారు. గోదావరి జలాలతో చెరువులు నింపాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బచ్చన్నపేట మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల వరకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. దేవాదుల రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీరు విడుదల చేయాలని కోరారు. ఈ నెల 12వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పేదలకు ఉపయోగపడేలా బడ్జెట్ రూపొందించాలని సీఎంను కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద మహిళలకు నెలకు రూ.2,500, అర్హులైన రైతులకు రూ.2 లక్షల లోపు పంట రుణాల మాఫీ అమలు కాలేదన్నారు. నూతనంగా ఏర్పడిన స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని జాన్‌వెస్లీ కోరారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకుడు ఎండీ అబ్బాస్, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, నాయకులు చంద్రయ్య, పొదల నాగరాజు, మైలారం వెంకటేశ్వర్లు, నామాల గిరి పొదల లవ కుమార్, కడారి ఐలయ్య, రాపర్తి రాజు, అహల్య, గోపి, వెంకటేశ్, విజేందర్, జనగామ మండల కార్యదర్శి బోడ నరేందర్, నాయకులు సాంబరాజు యాదగిరి, రవీందర్‌రెడ్డి, ప్రకాశ్, ఎల్లయ్య, పర్వతం నర్సింహులు, లక్ష్మి, కనకయ్య, శ్రీనివాస్, బలరాములు, కల్పన, బుచ్చమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కొడెపాక యాకయ్య, చుంచు విజేందర్, జోగు ప్రకాశ్, చిల్పూరు మండల కార్యదర్శి సాదం రమేశ్, నాయకులు కత్తుల రాజు, చిలుముల స్కర్, సిద్దుల సుదర్శన్, యార మోహన్, కత్తుల రాజు, దాసరి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్కారు నిర్లక్ష్యంతోనే ఎండిన పంటలు

ప్రభుత్వానికి, అధికారులకు ముందు చూపు లేకపోవడంతో దేవాదుల ఎత్తిపోతల పథకంలో జిల్లాలోని 8 రిజర్వాయర్లు, 769 చెరువులు, కుంటల్లో అవసరమైన సాగునీటిని నింపలేకపోయారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ఈ విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సకాలంలో రైతులకు అవసరమైన సాగునీటిని ప్రతి సంవత్సరం దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా అందించి పంటలు ఎండిపోకుండా కాపాడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిహారం చెల్లించకుంటే ఈ నెల 13వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామన్నారు.

రిజర్వాయర్ల పనులను త్వరగా పూర్తి చేయాలి

దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఇవి పూర్తయితే 7500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. అనంతరం తెలంగాణ సా యుధపోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనుమడు పాలకుర్తి మాజీ సర్పంచ్ చిట్యాల రామచంద్రం ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబ సభ్యులైన చిట్యాల సంపత్, శ్వేతను పరామర్శించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, రాపర్తి రాజు, సింగారపు రమేశ్, రాపర్తి సోమయ్య, ఇర్రి అహల్య, చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, సోమ అశోక్ బాబు, సత్యం ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న చైర్మన్ శివరాజ్ యాదవ్

మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

జనగామ, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యానికి మద్దతు ధర కోసం మార్కెట్‌లోనే సరుకులు విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది రాకుండా మార్కెట్ కమిటీ చొరవ తీసుకుంటుందని తెలిపారు. అవకతవకలు లేకుండా మార్కెట్ కమిటీ, సిబ్బంది ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నాగబండి రవీందర్, నామాల శ్రీనివాస్, బానోత్ బస్సీ నాయక్, బొట్ల నర్సింగరావు, అడ్తి అసోసియేషన్ అధ్యక్షుడు మశెట్టి వెంకన్న, ఏఎంసీ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగార్జున, వ్యాపారులు, రైతులు వెంకటేశ్, రమేశ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కళావతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సావిత్రీబాయిపూలేను స్ఫూర్తిగా తీసుకోవాలి

దేవరుప్పుల మార్చి 10: సావిత్రీబాయిపూలేను స్ఫూర్తిగా తీసుకుని మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని మండల విద్యాశాఖాధికారి కళావతి అన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఉపాధ్యాయునులు ఎంఈవోను సన్మానించారు. కళావతి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలపై లైంగిక దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణు, ఆంజయ్య, శంకరయ్య, వరప్రసాద్, మంజుల, రాంచందర్, యాకస్వామి, పద్మావతి, పద్మారాణి, రమాదేవి, లలిత పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. హెచ్ఎం మంగు జయప్రకాశ్ ఉపాధ్యాయులతో కలిసి సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయినులకు, నాన్ టీచింగ్ , సర్వీస్ పర్సన్, మధ్యాహ్న భోజన పథకం మహిళలను సన్మానించారు.

హిమ్మత్‌నగర్‌లో ఉపాధ్యాయునులను సత్కరించిన హెచ్ఎం

వర్గీకరణ అనంతరమే ఫలితాలు విడుదల చేయాలి

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 10 : ఎస్సీ వర్గీకరణ అమలు చేశాకే తెలంగాణలో పోటీ పరీక్షల ఫలితాలను విడుదల చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలేదీక్షలు ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బాబు జగ్జీవన్ రాం విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ నేతృత్వంలో నిరసన తెలిపారు. వర్గీకరణ అనంతరమే గ్రూప్ 1, 2, 3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఇతర ఉద్యోగాల పరీక్షల ఫలితాలను విడుదల చేయాలని కోరారు. దీక్షలకు బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు మారేపల్లి ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కలకోల రజినీకాంత్, జేడీ రమేశ్ సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు చాడ ఏలియ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు గాదె శ్రీధర్, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి గాదె నరేశ్, ఉపాధ్యక్షుడు మేడే యాకస్వామి, గుర్రం శ్రీనివాస్ పాల్గొన్నారు.

తీగారం చెరువులో నరికిపడేసిన తుమ్మచెట్లు

తీగారం చెరువులో తుమ్మచెట్లు మాయం

పాలకుర్తి, మార్చి 10: మానవాళి మనుగడకు చెట్లే ఆధారం అని ప్రచారం చేస్తున్న సర్కారు అలాంటి చెట్లు మాయమవుతుంటే పట్టించుకోవడం లేదని విమర్శలొస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తీగారం చెరువులో తుమ్మ చెట్లను అక్రమంగా కొందరు నరికేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంతకాలంగా కొందరు దొడ్డిదారిన తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై ఐబీ డీఈ శ్రీకాంత్‌శర్మను వివరణ కోరగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

మృతుల కుటుంబాలకు రాజయ్య పరామర్శ

చిల్పూరు, మార్చి 10 : మండలంలోని వెంకటాద్రిపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ముక్కెర వలేందర్‌రెడ్డి తండ్రి ముక్కెర సంజీవ రెడ్డి(85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇదిలా ఉండగా ఇదే గ్రామానికి చెందిన నోముల శ్రీనివాస్ యాదవ్ అప్పుల బాధతో ఇటీవల ఆత్మహత్య చేసుకోగా మృతుడి కుటుంబాన్ని తాటిండ రాజయ్య. పరామర్శించి రూ.5 వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏడవెల్లి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ జంగం యాదగిరి, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి మాలోత్ రమేశ్‌నాయక్, నాయకులు మంతెన రాజు, కోటి పాల్గొన్నారు.